క్లుప్తంగా

బకాయి జీతాలు చెల్లించాలి



ఎంపీడీఓకు వినతిపత్రం ఇస్తున్న గ్రీన్ అంబాసిడర్లు

నగరి: మండలంలోని గ్రీన్ అంబాసిడర్ కార్మికులకు 18 నెలల జీతాలు చెల్లించాలంటూ ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోదండయ్య డిమాండ్ చేశారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయం వద్ద గ్రీన్ అంబాసిడర్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు రాజేంద్రన్ అధ్యక్షతన ఎంపీడీఓ కార్యాలయం వద్ద ఆందోళన నిర్వహించారు. గ్రీన్ అంబాసిడర్లతో కలిసి వారి సమస్యలు పరిష్కరించాలంటూ ఎంపీడీఓ కృష్ణయ్యకు వినతి పత్రం అందజేశారు. ఎంపీడీఓ స్పందిస్తూ జిల్లా అధికారులతో మాట్లాడి కార్మికుల వేతనాలు చెల్లి స్తామన్నారు. గ్రీన్ అంబాసిడర్ మండల నేతలు దేశప్ప, జోసఫ్ పాల్గొన్నారు.

గంగ ఒడికి గణపతి



ఊరేగింపులో యువత కేరింతలు

శ్రీరంగరాజపురం: మండలంలోని పోదలపల్లి గ్రామంలో మంగళవారం గణపయ్య నిమజ్జనం కోలాహలంగా సాగింది. సర్పంచ్ ఏకాంబరం ఆధ్వర్యంలో గణనాథుల నిమజ్జనం కనులపండువగా సాగింది. ఏడు రోజులుగా పూజలందుకున్న లంబోదరుడు మంగళవారం నిమజ్జనానికి తరలివెళ్లారు. చెరువు వద్ద ఉదయం నుంచి సాయంత్ర వరకు నిమజ్జన సందడి నెలకొంది.

రేపు క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు

పుత్తూరు: గొల్లపల్లి పీహెచ్‌సీ వద్ద గురువారం పింక్ బస్ ద్వారా ఉచితంగా క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించనున్నట్లు వైద్యాధికారి డాక్టర్ ఎస్.ఎం.ప్రవీణ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్విమ్స్ తిరుపతి వారి ఆధ్వర్యంలో ఈనెల 4వ తేదీ ఉదయం 10 గంటలకు క్యాంపు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు ఉచితంగా చేయనున్నట్లు వెల్లడించారు. రూ.7వేల నుంచి రూ.10 వేల వరకు నిర్ధారణ పరీక్షలకు ఖర్చు అవుతుందని, అలాంటిది ఉచితంగా అందిస్తున్నట్లు తెలిపారు. మహిళా డాక్టర్ల పర్యవేక్షణలో జరిగే ఈ ఉచిత వైద్యశిబిరాన్ని గ్రామీణ మహిళలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పేదలకు నాణ్యమైన వైద్యం అందించండి



వైద్యులతో మాట్లాడుతున్న ఎంపీపీ

కార్వేటినగరం: పేదలకు నాణ్యమైన వైద్యసేవలు అందించాలని ఎంపీపీ లత అన్నారు. ఆమె మంగళవారం మండల కేంద్రంలోని సీహెచ్‌సీ సందర్శించి రోగుల ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో నుంచి వచ్చే ప్రతి పేదవాడికి నాణ్యమైన వైద్యం అందించాలన్న దృక్పథంతోనే మాజీ ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి 50 పడకల ఆస్పత్రిగా మార్చారని చెప్పారు. వైద్య సిబ్బంది సమయపాలన పాటించి, సకాలంలో వైద్య సేవలు అందించాలని కోరారు. ఆమె వెంట ఎంపీటీసీ దేశమ్మ, సర్పంచ్ పవన్‌కుమార్, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షురాలు మోహనకుమారి, సుమతి ఉన్నారు.

పెండింగ్ జీతాలు ఇవ్వండి



ఆందోళన చేస్తున్న గ్రీన్ అంబాసిడర్లు

పాలసముద్రం: గ్రీన్ అంబాసిడర్లుగా పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులకు పెండింగ్‌లో ఉన్న జీతాలను వెంటనే విడుదల చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోదండయ్య తెలిపారు. ఆయన మంగళవారం మండల అభివృద్ధి కార్యాలయం ఎదుట గ్రీన్ అంబాసిడర్లతో కలిసి ఆందోళన చేశారు. కోదండయ్య మాట్లాడుతూ ప్రభుత్వాలు మారిన గ్రీన్ అంబాసిడర్ కార్మికుల సమస్యలు మాత్రం ఎక్కడ వేసిన గొంగళి చందాన ఉన్నాయన్నారు. ఒక్కొక్క కార్మికుడికి 12 నుంచి 18 నెలల జీతాలు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. జీతాలు ఇవ్వకపోతే ఆ కుటుంబాలను ఎలా పోషించుకోవాలని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం ఎంపీడీఓ సతీష్‌కు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో గ్రీన్ అంబాసిడర్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి గోవిందస్వామి, మురళి, బాలాజీ, కుప్పమ్మ పాల్గొన్నారు.

తొమ్మిది మంది వీఆర్వోలకు షోకాజ్ నోటీసులు

గంగాధరనెల్లూరు: అత్యవసర సమావేశానికి హాజరు కాని 9మంది వీఆర్వోలకు మంగళవారం షోకాజ్ నోటీసులు జారీ చేసినట్లు తహసీల్దార్ సీ.కే.శ్రీనివాసులు తెలిపారు. ఆయన మీడియాతో మాట్లాడుతూ మండలంలో జరిగిన రీసర్వేలో చోటు చేసుకున్న అవకతవకలపై నిర్వహించిన సమావేశానికి డుమ్మా కొట్టిన 9 మందికి నోటీసులు ఇచ్చినట్లు తెలిపారు. నోటీసులు అందుకున్న వారు గైర్హాజరుపై వివరణ ఇవ్వకుంటే చర్యలకు ఆదేశిస్తామని హెచ్చరించారు.

మరపురాని మహానేతకు నివాళి



జీడీ నెల్లూరు: వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న కృపాలక్ష్మి, నేతలు



నగరి ఏరియా ఆస్పత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్లు పంచుతున్న కుమారస్వామి రెడ్డి, పుత్తూరులో నివాళులర్పిస్తున్న కుమారస్వామిరెడ్డి



దామరపాకంలో నేతల నివాళి



- వాడవాడలా వైఎస్సార్ వర్ధంతి
- పార్టీ శ్రేణులు, అభిమానుల నివాళి

మరపురాని మహానేత దివంగత ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖరరెడ్డికి పుత్తూరు, జీడీ నెల్లూరు నియోజకవర్గ ప్రజలు నివాళులర్పించారు. మంగళవారం వైఎస్సార్ వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహాలకు, చిత్రపటాలకు పూలమాలలు వేసి పుష్పాంజలి ఘటించారు. వైఎస్సార్ అమర్ రహే అంటూ నినాదాలు మిన్నంటించారు. పార్టీశ్రేణులు, వైఎస్ అభిమానులు పేదలకు అన్నదానం చేశారు. రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు.

నగరి: వైఎస్సార్ 16వ వర్ధంతిని పురస్కరించుకుని మంగళవారం స్థానిక బస్టాండు ప్రాంగణంలోను, ఓంశక్తి ఆలయం సమీపం బైపాస్ సర్కిల్‌లోని వైఎస్సార్ విగ్రహాలకు పూలమాలలు వేసి మాజీ మంత్రి ఆర్కేరోజా సోదరుడు కుమారస్వామిరెడ్డి, పార్టీ నేతలు నివాళులర్పించారు. ఏరియా ఆస్పత్రిలోని రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. నేతలు నివాళులర్పించారు. పేదలకు అన్నదానం చేశారు.

పుత్తూరు: డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి వర్ధంతి సందర్భంగా వైఎస్సార్‌సీపీ పార్టీ శ్రేణులు, వైఎస్ అభిమానులు నివాళులర్పించారు. డాక్టర్ వైఎస్ వర్ధంతి సందర్భంగా పుత్తూరు పున్నమి సర్కిల్ వద్ద గల ఆయన విగ్రహానికి వైఎస్సార్‌సీపీ నేత వై.కుమారస్వామిరెడ్డి గజమాల వేసి నివాళులర్పించారు. అనంతరం స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలోని రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. గోపాలకృష్ణాపురంలో ఉన్న ఆయన విగ్రహానికి జీడీ నెల్లూరు సమన్వయకర్త కృపాలక్ష్మి, నేతలు నివాళులర్పించారు. అదేవిధంగా వడమాలపేటలో వైఎస్సార్‌సీపీ నేతలు, అభిమానులు నివాళులర్పించారు.

నింద్రలో..

నింద్ర: స్థానిక బస్టాండ్ వద్ద వున్న వైఎస్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అదేవిధంగా జగనన్న కాలనీ, కర్పరవేడు, ఇరుగువాయి గ్రామల్లో నివాళులర్పించారు.

విజయపురంలో..

విజయపురం: మండలంలోని పన్నూరు సబ్‌స్టేషన్ కూడలి వద్ద వైఎస్సార్ విగ్రహానికి పూలమాలవేసి నేతలు నివాళులర్పించారు. 500 మందికి అన్నదానం చేశారు. పాల్గొన్నారు.

కార్వేటినగరం: వైఎస్సార్ వర్ధంతి సందర్భంగా మంగళవారం మండల కార్యాలయం ఆవరణలో రంలో నేతలు నివాళుర్పించారు.

శ్రీరంగరాజపురంలో..

శ్రీరంగరాజపురం: మండలంలోని 49 కొత్తపల్లి మిట్టలో మంగళవారం కళత్తూరు కృపాలక్ష్మి వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

గంగాధర నెల్లూరు: ఎంపీడీఓ కార్యాలయం ముందు గల వైఎస్సార్ విగ్రహానికి నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం బ్రెడ్ పంపిణీ, అన్నదానం చేశారు.

పాలసముద్రంలో..

పాలసముద్రం: మండల కేంద్రంలో నేతలు వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి క్షీరాభిషేకం చేసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం 100 మందికి అన్నదానం చేశారు.

వెదురుకుప్పంలో..

వెదురుకుప్పం: వెదురుకుప్పం, పచ్చికాపల్లం, జక్కిదొన, గంటావారిపల్లె, దేవళంపేట గ్రామాల్లోని వైఎస్ఆర్ విగ్రహాలకు వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పద్మనాభరెడ్డి ఆధ్వర్యంలో పార్టీ నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు.

పెనుమూరులో..

పెనుమూరు: తహసీల్దార్ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన వైఎస్సార్ విగ్రహానికి మాజీ ఎంపీ మహాసముద్రం జ్ఞానేంద్రరెడ్డి, నేతలు పూలమాల వేసి నివాళులర్పించారు.



వడమాలపేటలో నేతల నివాళి



గోపాలకృష్ణాపురంలో నేతల నివాళి



నింద్రలో నేతల నివాళి



విజయపురంలో అన్నదానం





విజయపురం: నేతల నివాళి, శ్రీరంగరాజపురం: అన్నదానం చేస్తున్న కృపాలక్ష్మి



పాలసముద్రం: అన్నదానం చేస్తున్న నాయకులు



కార్వేటినగరంలో నేతల నివాళి



పెనుమూరులో నివాళి



పెనుమూరులో నివాళి



వెదురుకుప్పంలో..

మచ్చలేని నాయకుడు నారాయణస్వామి



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న జీడీ నెల్లూరు మండల నాయకులు

గంగాధర నెల్లూరు: మాజీ డెప్యూటీ సీఎం నారాయణస్వామి 30 ఏళ్ల రాజకీయ జీవితంలో అవినీతి మచ్చలేని నాయకుడిగా పేరొందారని వైఎస్సార్‌సీపీ మండల నాయకులు పేర్కొన్నారు. మండల కేంద్రంలో రెండు రోజుల క్రితం ఎమ్మెల్యే థామస్ మాజీ ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి పై చేసిన అనుచిత వ్యాఖ్యలను వారు విలేకరుల సమావేశంలో తీవ్రంగా ఖండించారు. వారు మాట్లాడుతూ, నారాయణస్వామి తన రాజకీయ జీవితం మొత్తం ప్రజల కోసమే పనిచేశారని వెల్లడించారు. సర్పంచ్ నుంచి, సమితి ప్రెసిడెంట్‌గా ఎమ్మెల్యేగా, ఉప ముఖ్యమంత్రిగా ఎదిగారని గుర్తించారు. కార్యక్రమంలో నేతలు గుణశేఖర్ రెడ్డి, అంబోధరపల్లి బాబు రెడ్డి, జిల్లా బూత్ కన్వీనర్ వెంకటేష్‌రెడ్డి, ఎంపీటీసీ రామచంద్రారెడ్డి పాల్గొన్నారు.

ఆర్ఎంపీ క్లినిక్‌ల సీజ్



ఆర్ఎంపీ, పీఎంపీ క్లినిక్‌లను సీజ్ చేస్తున్న జిల్లా డెప్యూటీ డీఎంహెచ్ఓ హనుమంతురావు

శ్రీరంగరాజపురం: మండలంలోని ఆర్ఎంపీ, పీఎంపీ క్లినిక్‌లపై డెప్యూటీ డీఎంహెచ్ఓ హనుమంతరావు మంగళవారం మెరుపు దాడులు నిర్వహించారు. ఇంజక్షన్లు, ఆపరేషన్ స్టెరాయిడ్స్ వంటివి వాడుతున్నారని గుర్తించారు. ఇందులో భాగంగా నాలుగు క్లినిక్‌లను సీజ్ చేశారు. ఇందులో ప్రథమ చికిత్స మాత్రమే చేపట్టాలన్నారు. ఎవరైనా ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. దాడుల్లో మండల వైద్యాధికారి షమిమి రెహ్మాన్ పాల్గొన్నారు.

నేడు సర్వసభ్య సమావేశం

నింద్ర: మండల సర్వసభ్య సమావేశం నేడు బుధవారం ఉదయం 10.30 గంటలకు స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ శివప్రసాద్ వర్మ మంగళవారం తెలిపారు. మండల సమావేశానికి మండలంలోని ఎంపీటీసీలు, జెడ్పీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, మండల అధికారులు తప్పక హాజరుకావాలని కోరారు.

ప్రకృతి వ్యవసాయంతోనే రైతే రాజు



మాట్లాడుతున్న వ్యవసాయ అధికారి రేవతి

పాలసముద్రం: ప్రకృతి వ్యవసాయ విధానాలను సక్రమంగా అమలు చేస్తే రైతే రాజు అవుతాడని ప్రకృతి వ్యవసాయాధికారులు రాజా ప్రతాప్, మునిరాజ, రేవత, పుష్ప తెలిపారు. మంగళవారం శ్రీకావేరిరాజుపురం రైతు సేవాకేంద్రంలో సర్పంచ్ గాలి మహేష్, ఎంటీ రాజాప్రతాప్ ఆధ్వర్యంలో రైతులకు ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించారు. వ్యవసాయ అధికారులు రేవతి, పుష్ప మాట్లాడుతూ రసాయన ఎరువులు, పురుగుమందులు ఉపయోగించకుండా సహజ పద్ధతుల్లో చేసే వ్యవసాయమే ప్రకృతి సేద్యమని వివరించారు. కార్యక్రమంలో మునియమ్మ, నిర్మల, రైతులు పాల్గొన్నారు.

కూటమిది అరాచక పాలన



మీడియాతో మాట్లాడుతున్న జెడ్పీటీసీ సభ్యులు అన్బళగన్, నాయకులు

పాలసముద్రం: సంపద సృష్టించి, ప్రజలందరికీ పంచి పెడతానని హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన చంద్రబాబు, అరాచక పాలన సాగిస్తున్నారని జెడ్పీటీసీ సభ్యుడు అన్బళగన్, వైస్ ఎంపీపీ శేఖర్ యాదవ్ తెలిపారు. వారు మంగళవారం మీడియాతో మాట్లాడుతూ కూటమి నేతల దాడులు, పోలీసుల వేధింపులు కారణంగా ప్రజల్లో వ్యతిరేకత అధికమైందని తెలిపారు. రాష్ట్రంలో ఏడాదిన్నర కాలంగా పరిపాలన గాడి తప్పిందని తెలిపారు. కూటమి నేతల మాటలు నమ్మి ఓట్లేసిన ప్రజలపై అధిక పన్నుల భారం తప్ప మరేమి ప్రయోజనం లేకుండా పోయిందని ఎద్దేవా చేశారు. వైఎస్సార్‌సీపీ నాయకులు. కార్యకర్తలపై దాడులు, అక్రమ కేసులు, సోషల్ మీడియా కార్యకర్తలపై అక్రమ కేసులు నమోదు చేసుడంతో కూటమి నేతలు రికార్డు సృష్టించారన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ గోవిందరాజు, సర్పంచ్‌లు నరసింహరాజు, లిల్లీఆనంద్, మహేష్, అయ్యప్ప, అనురేఖ, నాయకులు పాల్గొన్నారు.

గంగజాతరకు అంకురార్పణ



జాతర పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

నగరి: పట్టణ పరిధిలో నిర్వహించనున్న గంగజాతరకు జాతర నిర్వాహకులు మంగళవారం అంకురార్పణ చేశారు. చావడి ప్రాంతంలో గంగమ్మను ఉంచే బండ వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాత్రి సామాలమ్మ ఆలయం వద్ద పూజలు చేసి గ్రామంలో చాటింపు వేయడంతో జాతర కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. నిర్వాహకులు మాట్లాడుతూ జాతర నిర్వహణలో చేపట్టనున్న కార్యక్రమాలను వెల్లడించారు. ఈనెల 7వ తేదీ నుంచి 9వ తేదీ వరకు పురవీధుల్లో గరిగ ఊరేగింపు ఉంటుందన్నారు. 9వ తేదీ ఉదయం గంగమ్మ బండ సమీపం ఉన్న ఖాళీ ప్రదేశంలో మహాశక్తి శివలింగం ఏర్పాటుచేస్తామని సాయంత్రం గ్రామ దేవతలు ఓరుగుంటాలమ్మ నవదుర్గాదేవి అలంకరణలోను, దేశమ్మ మహిషాసురమర్దిని అలంకరణలోను చావడి ప్రాంతానికి వచ్చి చేరుతుందన్నారు. 10వ తేదీ బుధవారం పట్టణంలో గంగజాతర నిర్వహిస్తామన్నారు. 12న ఓరుగుంటాలమ్మ దేవతను వరలక్ష్మి అలంకరణలోను, దేశమ్మ దేవతను సింహవాహిని అలంకరణలోను పట్టణ పరిధిలో ఊరేగింపు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమాలకు సంబంధించిన పోస్టర్లను జాతర కమిటీ పెద్దలు ఆవిష్కరించారు. చిరంజీవిరెడ్డి, జ్యోతిరెడ్డి, ఆనం సురేష్, దయానిధి, కృష్ణారెడ్డి, గోపాల్‌రెడ్డి, గుణశేఖర్, జ్యోతినాయుడు, ఆర్.బాబు, టీకేఎం శ్రీనివాసులు, శ్రీనివాసులు, రమేష్ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో చాటుబండి



గరిగెల ఊరేగింపు

పుత్తూరు: గ్రామ దేవత గంగమ్మ జాతర చాటుబండి కార్యక్రమం మంగళవారం రాత్రి భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం 7 గంటలకు స్థానిక శ్రీద్రౌపదీదేవి సమేత శ్రీధర్మరాజులస్వామి ఆలయం నుంచి రెండు గరిగల ఊరేగింపు ప్రారంభమైంది. రాత్రి 8 గంటలకు బజారు వీధిలోని గంగమ్మ ఆలయం నుంచి నిర్వాహకులు మంగళవాయిద్యాలతో ఊరేగింపుగా బయలుదేరి కాపువీధిలోని కేశావాచ్చారి కుటుంబం వారు తయారు చేసిన చాటుబండికి పూజలు నిర్వహించారు. అక్కడ నుంచి చాటుబండిని తీసుకొని మండపం వద్ద ఉంచి పూజలు చేశారు. అక్కడ నుంచి ఊరేగింపుగా ఆరేటమ్మ ఆలయం వద్దకు వెళ్లి పసుపు కుంకుమను సమర్పించారు. దివిలి వెంకట్రాయులు మందడి కుటుంబం వారిచే చాటుబండికి బలిదానం ఇచ్చారు. అక్కడ నుంచి కుమ్మరి కన్నయ్య ఇంటికి వెళ్లి గంగపెట్టి తీసుకొని మండపం వద్దకు తీసుకొచ్చి అన్నంతో దీపం వెలిగించి పూజలు చేశారు. అనంతరం చాటుబండిని మంగళ వాయిద్యాలు, బాణసంచా నడుమ ఊరేగించారు. బజారు వీధిలోని నాలుగు వీధుల కూడలి వద్ద చలువ పందిళ్లు, వాటికి వస్త్రాలంకరణ, అమ్మవారి ఆలయానికి ప్రత్యేక విద్యుద్దీప అలంకరణలు, ఇరువైపులా క్యూలు ఏర్పాట్లు పూర్తి చేశారు. పట్టణంలోని ప్రధాన కూడల్లో వేపాకు తోరణాలు, అమ్మవారి ప్రతిమలతో కూడిన విద్యుత్ దీప కటౌట్లతో పట్టణం జాతర సందడి సంతరించుకొంది. బుధవారం ఉదయం గంగమ్మ దర్శనమియ్యనుంది.

ఆర్ఎంపీ క్లినిక్‌ల తనిఖీ



ఆర్ఎంపీ క్లినిక్‌ను తనిఖీ చేస్తున్న హనుమంతరావు

గంగాధర్‌నెల్లూరు: మండల కేంద్రంలోని ఆర్ఎంపీ, పీఎంపీ క్లినిక్‌లను డెప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ హనుమంతరావు ఆకస్మికంగా తనిఖీ చేశారు. మండల కేంద్రంలో ఆర్ఎంపీలు మునిరాజు, గిరిరాజు, జానకిరామిరెడ్డి, దినకర్‌తో మాట్లాడి వారి వద్ద వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఫస్ట్ ఎయిడ్ తప్ప క్లినిక్‌లో ఇతర వైద్య సేవలు చేయరాదన్నారు. డాక్టర్ ప్రవీణ్, సీహెచ్ఓ కృష్ణయ్య, హెల్త్ అసిస్టెంట్ కదిరివన్, సచివాలయ మహిళా పోలీస్ రత్న, ఆశా వర్కర్ జ్యోతి పాల్గొన్నారు.





పంబ వాయిద్యాలతో గ్రామ దేవతకు అంబలి తీసుకొస్తున్న మహిళలు, గంగమ్మ ఊరేగింపు

గంగమ్మతల్లికి ప్రత్యేక పూజలు

పాలసముద్రం: మండలంలోని శ్రీకావేరిరాజుపురంలో గంగమ్మజాతరను పురస్కరించుకుని మంగళవారం గంగమ్మతల్లికి ప్రత్యేక పూజలు చేసి పుర వీధుల్లో భక్తులు ఊరేగించారు. ఉదయం గ్రామ దేవతకు పంబవాయిద్యాలతో ప్రతి ఇంటి నుంచి మహిళల అంబలి తీసుకొచ్చి అమ్మవారికి సమర్పించారు. సాయంత్రం పొంగళ్లు పెట్టి నైవేద్యం సమర్పించారు.

రెండు పేయ దూడల జననం



గంగాధర నెల్లూరు: ఒక పాడి ఆవు రెండు పేయ దూడలకు జన్మనిచ్చిన సంఘటన మండల పరిధిలోని వేపంజేరి గ్రామంలో చోటుచేసుకుంది. వేపంజేరి గ్రామానికి చెందిన మార్కొండరెడ్డికి ఆవులు, దూడలు మొత్తం 10 వరకూ ఉన్నాయి. ఇందులో ఒక మూడేళ్ల ఆవు రెండో ఈతలో రెండు పేయ దూడలకు జన్మనిచ్చింది.

సమతుల్య ఎరువులు వాడండి



రైతులతో మాట్లాడుతున్న వ్యవసాయాధికారులు

వడమాలపేట(పుత్తూరు): రైతులు వరి సాగులో వ్యవసాయాధికారులు సిఫార్సు చేసిన మేరకే ఎరువులు వినియోగించాలని ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయంకు చెందిన జిల్లా ఏరువాక కేంద్రం కోఆర్డినేటర్, ప్రిన్సిపల్ డాక్టర్ రామకృష్ణారావు సూచించారు. మంగళవారం వడమాలపేట మండలం పత్తిపుత్తూరు, చింతకాల్వ గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సమతుల్య ఎరువులు వాడడం వల్ల అధిక దిగుబడులు సాధించవచ్చునని తెలిపారు. ముందస్తుగా విత్తన ఎంపిక, పొలం తయారీ, విత్తన శుద్ధి ప్రాముఖ్యతను వివరించారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా ప్రతి మంగళ, బుధ వారాల్లో వ్యవసాయాధికారులతో పాటు అనుబంధ శాఖ అధికారులు పొలంబాట పడతారని తెలిపారు. రోజుకు రెండు గ్రామాల్లో పర్యటించే అధికారులు ముందుగా పొలాలను సందర్శించి, అనంతరం రైతులతో సమావేశం నిర్వహించి తగిన సూచనలు అందిస్తారని తెలిపారు. వడమాలపేట వ్యవసాయాధికారి విజయ్‌కుమార్, వీఏఏలు వాణి, రైతులు పాల్గొన్నారు.